క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో నాయకులు, గ్రామస్తులు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో మల్లారెడ్డి, సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో గ్రామస్తులు పాల్గొనగా వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేందర్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రణదీప్‌రెడ్డి, ఉపసర్పంచ్ పెంటమ్మ, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో ముగిసిన శ్రావణమాసోత్సవాలు



కీసరగుట్టలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నెలరోజుల పాటు నిర్వహించిన శ్రావణ మాసోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరుడికి వేదపండితులు అమావాస్య సందర్భంగా తైలాభిషేకం తోపాటు, అన్నపూజ(వరి అన్నంతో శివలింగాన్ని కప్పి వేయడం) నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్, ఆలయ వేదపండితులు తదితరులుపాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని నేతాజీనగర్‌కాలనీలో సుమారు రూ.7 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో గుర్తించిన చోట అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేషయాదవ్, నాయకులు కౌకుట్ల కృష్ణారెడ్డి, అన్నంరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలకు అభినందనలు



ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడాల్లో అండర్-14 బాలికల ఖోఖో క్రీడా పోటీలో చౌదరిగూడ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన సభలో చైర్మన్ జగన్‌మోహన్‌రావు, ప్రిన్సిపల్ రజిత ఖోఖో విజేతలను అభినందించారు. ఇటీవల ఘట్‌కేసర్‌లో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి క్రీడల్లో అండర్-14 బాలికల ఖోఖోలో అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు విన్నర్‌గా నిలిచింది. అనంతరం ప్రిన్సిపల్ రజిత మాట్లాడుతూ క్రీడలతో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభిస్తుందన్నారు.

18 ఏళ్లు నిండితే ఓటు నమోదు చేసుకోవాలి



కీసర: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భోగారం హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు ఓటుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, కీసర సీఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేతల్లో జమిలి టెన్షన్

పలు కార్యక్రమాల పేరుతో వదులుతున్న చేతి చమురు

- ఎన్నికలు ఆలస్యమైతే ఇబ్బందేనని ఆవేదన
- బీఆర్ఎస్, ప్రతిపక్ష ఆశావహుల్లోనూ ఖర్చు భయం
- పండగల నేపథ్యంలో వారిలో మరింత ఆందోళన



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో రాజకీయవేడి పెంచగా.. బీఆర్ఎస్ అభ్యర్థులతో పాటు ప్రతిపక్ష పార్టీలోని ఆశావహులకు చేతి చమురు వదులుతోంది. అధికార పార్టీ ప్రకటించిన అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష పార్టీలో టికెట్లు ఆశిస్తున్న నాయకులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తమ ఉనికి చాటుకోవడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో జమిలి ఎన్నికలు ఉంటాయా? అనే ప్రచారం ఆ నాయకుల్లో ఆందోళన పెంచుతోంది. ఇంకా ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే కార్యక్రమాలతో భారీగా ఖర్చు అవుతోందని ఇంకా ఆలస్యమైతే తమ పరిస్థితి ఏమిటని అధికార పార్టీ అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష ఆశావహులు భయంగా ఉన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు.. ఆపై వచ్చే సద్దుల బతుకమ్మ దసరా పండుగల నేపథ్యంలో ఖర్చు మరింత భారం కానుందని ఆందోళన చెందుతున్నారు.

ప్రజల మద్దతు కోసం..

ప్రజల మద్దతు కూడగట్టేందుకు వివిధ కార్యక్రమాల పేరుతో పాదయాత్రలు, సమ్మేళనాలు, డివిజన్లు/వార్డులు, గ్రామాలు, బస్తీలవారీగా అభ్యర్థులు, ఆశావహులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెంట తిరిగే నాయకులు, కార్యకర్తలకు రోజూ ఎంతో కొంత ఖర్చు చేయాల్సి వస్తోంది. కొంతమంది నాయకులైతే ఇప్పటి నుంచే ఆత్మీయ సమావేశాలు, సభల పేరుతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా జన సమీకరణలు, బల ప్రదర్శన చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిత్వాలు ఖరారు కాగా, ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. చాలా నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల తరఫున ముగ్గురు మించి ఆశావహులు ఉన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆశావహుల్లో ఒకరు ఖర్చుచేస్తూ.. ముందుకు వెళ్తుంటే అదేస్థానం నుంచి టికెట్ కోసం పోటీ పడుతున్న నాయకులు తప్పనిసరిగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ఎన్నికలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ ఖర్చు మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారుతో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో.. ప్రధానంగా మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి(మంత్రి), మాధవరం కృష్ణారావు సామాజిక వర్గాలవారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భోజనాలు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. బస్తీలు, వాడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. సామూహిక భవనాలు, దేవాలయాలకు నిధులు కేటాయిస్తూ ఆయా వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తూ బలం చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

మూడింటిలో బల ప్రదర్శనే..

- కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ టికెట్ ఖరారైన సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, టికెట్ ఆశించి.. భంగపడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను కలుస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కూడా ఎవరికి వారుగా భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకోలేక ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్ తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.
- మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు టికెట్ కేటాయించినా.. మెదక్‌లో కుమారుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఉన్నప్పటికీ, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.
- ఉప్పల్‌లో కూడా సిట్టింగ్ కాదని, మరో నేత బండారి లక్ష్మారెడ్డికి టికెట్ ఖరారు చేయటంతో.. ఇద్దరూ ఎవరికి వారుగా వివిధ కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

కాంగ్రెస్ నేతల దూకుడు

ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ క్రమంలో అధిష్టానానికి తమ బలాన్ని చాటేందుకు పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు 43 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గాల్లో కీలక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. మరో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారే తమకే అభ్యర్థిత్వం ఖరారవుతోందన్న నమ్మకంతో ద్వితీయ శ్రేణి నాయకులను సమీకరిస్తూ.. బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బీజేపీ కార్యక్రమాలు షురూ..

బీజేపీలోనూ పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకులు కూడా తమ కార్యక్రమాలను మొదలు పెట్టారు. జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గంలో టికెట్ ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నా.. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ.. వ్యక్తిగతంగా అనుచరులతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పోటీ పడుతున్న ఆశావహులు కార్యక్రమాల నిర్వహణకు డబ్బు వెచ్చించక తప్పడం లేదు.

హోలీమేరిలో ఎన్నికల వసతులపై ఆరా



భోగారం హోలీమేరి కళాశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్


- రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లకు అనుకూలమా
- కాలేజీని పరిశీలించిన కలెక్టర్ అమయ్‌కుమార్

కీసర: భోగారం గ్రామంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కాలేజీని శుక్రవారం సాయంత్రం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ పరిశీలించారు. మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌లకు సంబంధించి కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తే వసతులు ఎలా ఉంటాయని పరిశీలించారు. కళాశాలలో అన్ని వసతులకు అనుకూలంగా కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌కు సంబంధించి బందోబస్తు, స్ట్రాంగ్‌రూమ్, హాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాలేజీ ఆవరణను పరిశీలించి ఆర్ఓ, ఈఆర్ఓ, ఏఆర్ఓ, ఏఈఆర్ఓ, అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ కలెక్టర్ సైదులు, కీసర–మల్కాజిగిరి ఆర్డీవోలు శ్యామ్ ప్రకాష్, రాజేష్‌కుమార్, ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల విద్యార్థులు శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈచ్ వన్ రీచ్ వన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గుండ్లపోచంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నిర్వాహకురాలు నిఖిల, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈ–ఇంజినీరింగ్ స్టాఫ్ కళాశాల ఒప్పందం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాల శుక్రవారం ఇంజినీరింగ్ స్టాఫ్ కళాశాలతో పలు అంశాల్లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, స్టాఫ్ కళాశాల డైరెక్టర్ రామేశ్వర్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. అంతకుముందు ఇంజినీర్స్ డే సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్‌సీఈ డైరెక్టర్ సుధీర్‌రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల నిరసన దీక్ష

శామీర్‌పేట్: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల నిరసన దీక్ష శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతోంది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయాలు లేని చోట భర్తీ చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు నిరసన దీక్షను విరమించేది లేదని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సునీత తెలిపారు.



శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మున్సిపల్ టాక్స్ స్కామ్‌లో కమిషనర్లను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ టాక్స్ స్కామ్‌లో కారకులైన కమిషనర్లను సస్పెండ్ చేయాలని మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 నుంచి స్కామ్ జరిగితే లెక్కలు చూసుకోవాల్సిన కమిషర్లను వదిలేసి కిందిస్థాయి ఉద్యోగులను బలి చేయడం సరికాదన్నారు. గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో ఐదుగురు బిల్‌కలెక్టర్లను అవినీతి ఆరోపణలు, నకిలీ రశీదుల వ్యవహారంలో అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారని, మున్సిపల్‌గా అప్ గ్రేడ్ కాగానే అప్పటి మేనేజర్ వారిని కోర్టుకు తీసుకెళ్లి తిరిగి ఉద్యోగంలో చేర్పించారన్నారు. ఘట్‌కేసర్‌లో మొదటి నుంచి అవినీతిని ప్రోత్సహించింది అధికారులేనని, కొందరు రాజకీయ నాయకుల అండ వారికి ఉందన్నారు. అధికారులు స్కామ్ చేయని పక్షంలో రూ.31 లక్షలను ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. కొందరు నాయకులు బిల్‌కలెక్టర్లతో చేతులు కలిపి వారితో అవినీతి చేయించి కోట్లకు పడగలెత్తారని, విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయించి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, ఖయ్యూమ్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీకి స్వాగతం

ఘట్‌కేసర్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్‌రెడ్డి చేపట్టిన క్లాక్ టవర్– పరకాల అమరధామం బైక్ ర్యాలీకి ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తాలో ర్యాలీకి స్వాగతం పలికారు. అనంతరం కిషన్‌రెడ్డితో కలిసి బైక్‌పై బయలు దేరారు.



కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘనంగా ఇంజినీర్స్ డే

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఎమ్మార్ఐఈటీ, ఎమ్మార్‌ఈసీ, నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలతో పాటు కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

- నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలలో ఐడియా థాన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అశోక్ బహుమతులను అందజేశారు.



ఎమ్మార్ఐఈటీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

సీఎంఆర్‌సెట్‌లో..

కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకల్లో డీఆర్‌డీఓ డైరెక్టర్ సైంటిస్ట్ శ్రీనివాస్ శాస్త్రి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



నర్సింహారెడ్డి కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకల్లో కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి

ఓటుతోనే గుర్తింపు



జవహర్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రధాన చౌరస్తాలో శుక్రవారం ఓటు నమోదుపై వాహనంతో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మేయర్ మేకల కావ్య, కమిషనర్ రామలింగం హాజరై మాట్లాడుతూ.. ఓటుతోనే ప్రజాస్వామ్యంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మాధవచారి, సిబ్బంది శ్రీదేవి, ఎల్లమ్మ, రజిని, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్



పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 8వ డివిజన్ సంతోష్‌నగర్ కాలనీవాసుల సొంత నిధులు, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో జవహర్‌నగర్ అభివృద్ధికి నోచుకోలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ కార్పొరేషన్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, మల్లారెడ్డి, నర్సింహగౌడ్, రమణ, భాస్కర్, రజిత, భారతి, హేమ, వర్ష, కాలనీవాసులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు



సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్న ముప్పు శ్రీనివాస్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు న్యూహనుమాన్ నగర్ కాలనీలో వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయంలో(కాంక్రీట్) ఫ్లోరింగ్ పనులను చేయించాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం సొంత నిధులను వెచ్చించి చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పుందు కూడా తనవంతుగా వివిధ కాలనీల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. చంద్రశేఖర్, శ్రవణ్‌కుమార్, ప్రమోద్, శ్యాంసుందర్, నాగేశ్వరరావు, రఘుయాదవ్, ప్రవీన్, ఎండీ గౌస్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ఆవిష్కరణల్లో పాల్పంచుకోవాలి

మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయ్ ప్రకాశ్



మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయ్ ప్రకాశ్

ఘట్‌కేసర్: ప్రతి విద్యార్థి కొత్త ఆవిష్కరణల్లో పాల్పంచుకోవాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయ్ ప్రకాశ్ పిలుపునిచ్చారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఇంజినీర్స్ పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, డీన్‌లు ప్రొఫెసర్ ముత్తారెడ్డి, ప్రొఫెసర్ విజయకుమార్, ప్రొఫెసర్ సతీశ్‌కుమారన్, ప్రొఫెసర్ సుధీర్‌రెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ శ్రీనివాస్‌రావు, ఇంజినీరింగ్ విభాగాధిపతి నరేందర్, పలువురు అధిపతులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కీసర: బతుకు దెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మురేనా గ్రామానికి చెందిన రాజోరియా కిషన్‌పాల్ అలియాస్ రాహుల్(30) రెండేళ్ల క్రితం బతుకు దెరువు నిమిత్తం భార్య సంధ్య తనపిల్లలతో గోధుమకుంట పంచాయతీ పరిధిలోని ఎలిఫెంట్ కాలనీకి వలసవచ్చాడు. కాలనీలోని షీబాకు చెందిన ప్లాటు వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో కరెంట్ లో ఓల్టేజీగా ఉండటంతో పరిశీలించేందుకు కిషన్ పాల్ తన 9 ఏళ్ల కూతురు సోమీతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. కాసేపటికి కూతురు తల్లి వద్దకు వచ్చి విషయం చెప్పింది. వెంటనే సంధ్య ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా అతడు చెట్లపొదల మధ్య పడిపోయి కనిపించాడు. స్థానికుల సహాయంతో నాగారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందాడని డాక్టర్ తెలిపారు. దీంతో భార్య, పిల్లలు బోరున విలపించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హష్ ఆయిల్ విక్రేతల అరెస్టు

పోచారం: గంజాయితో తయారైన హష్ ఆయిల్‌ను అక్రమంగా అమ్ముతున్న వ్యక్తులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్‌రావ్ నగర్ మ్యాక్స్ షాపింగ్ మాల్ వద్ద శుక్రవారం తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి ఆయిల్ దొరికింది. వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. తనేరు శివతేజ(23), కర్ణ వేణు(23) సైనిక్‌పురిలో ఉంటూ వైజాగ్ నుంచి హష్ ఆయిల్ తెప్పించి, ఏఎస్‌రావ్‌నగర్‌లో విక్రయిస్తున్నట్లు చెప్పారు. 710 గ్రాముల హష్ ఆయిల్, రెండుఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ చేశారు. సీఐతో పాటు ఎస్సైలు పురుషోత్తంరెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

మేడ్చల్‌రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని, క్రమబద్ధీకరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బిల్ కలెక్టర్లు, కార్మికులు నిరసన చేపట్టారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తాము చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం వెంటనే తమను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేశ్, సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

విజయభేరి సభకు జనసమీకరణపై దృష్టి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరంలో రెండు రోజుల సీడబ్ల్యూసీ సమావేశాలకు కాంగ్రెస్ అగ్రనేతలు రానుండటంతో.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని టీపీసీసీ తుక్కుగూడలో ఈ నెల 17న విజయభేరి పేరుతో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తోంది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి 50 వేల మందిని సమీకరించేలా.. డీసీసీ కసరత్తు చేస్తోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 10 వేల మందిని విజయభేరీ సభకు తరలించేలా నియోజకవర్గం, మండలాల వారీగా బాధ్యులను జిల్లా కాంగ్రెస్ కమిటీ నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి జిల్లా పరిధిలోని అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో పెద్ద ఎత్తున జన సమీకరణపై కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజలను సభకు తరలించేందుకు 150 బస్సులు, 50కి పైగా ఇతర వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు.